కలెక్టర్లతో సిఎం చంద్రబాబునాయుడు నిర్వహించిన సదస్సులో పాల్గొన్న పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ (మధ్యలో ఉన్న వ్యక్తి)

ఉద్యమ స్ఫూర్తితో ముందుకు..

- నినదించిన సిపిఎం జిల్లా మహాసభ ● శ్రేణుల్లో సమరోత్సాహం
- ప్రజలతో మరింత మమేకమై పనిచేయాలని నేతల పిలుపు

సిపిఎం పార్వతీపురం మన్యం జిల్లా నూతన కమిటీతో జాతీయ, రాష్ట్ర నాయకులు పుణ్యవతి, సుబ్బరావమ్మ, తులసీదాస్, అశోక్

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి /కురుపాం

సిపిఎం పార్వతీపురం మన్యం జిల్లా 10వ మహాసభలు సమరోత్సాహంతో ముగిసాయి. రెండు రోజుల పాటు జరిగిన మహాసభలో జిల్లాలోని కీలక సమస్యలపైనా, ప్రభుత్వ విధానాల వల్ల ఈ ప్రాంతంలో ఉత్పన్నమవుతున్న ఆటంకాలపైనా కీలకంగా చర్చించారు. జిల్లా, రాష్ట్ర, దేశ రాజకీయాలు-ప్రజలపై వాటి ప్రభావం తదితర అంశాలను జాతీయ, రాష్ట్ర స్థాయి నేతలు ప్రతినిధులకు వివరించారు. ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టడంతో పాటు కీలక సమస్యలపైనా పోరాడాలని మహాసభ నిర్ణయించింది. జిల్లా సమగ్ర అభివృద్ధికి తగినన్ని నిధులు కేటాయించాలని సభ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. జిసిసి బలోపేతానికి, అటవీ హక్కుల చట్టం, ఉపాధి హామీ చట్టం పటిష్ట అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని, గిరిజన ప్రాంతంలో విద్య, వైద్యం, రోడ్లు తదితర సదుపాయాల మెరుగుకు ప్రభుత్వంపై పోరాడాలని మహాసభ నిర్ణయం చేసింది.

కురుపాంలోని కామ్రేడ్ సీతారాం ఏచూరి నగర్, బుద్ధదేవ్ బట్టాచార్య ప్రాంగణం, సత్యనారాయణ రాజు వేదికగా (సాయి నందకి కల్యాణ మండపం) రెండు రోజులు పాటు జరిగిన సిపిఎం పార్వతీపురం మన్యం జిల్లా మహాసభలు అత్యంత ఉత్సాహ పూరితంగా ముగిశాయి. గత మూడేళ్లలో పార్టీ చేపట్టిన ఉద్యమాలు, విస్తరణ, ముఖ్యంగా గత ఎన్నికల్లో ప్రజలు పార్టీని అభిమానించిన తీరు తెన్నులు, ప్రజలకు పార్టీ తరపున అందించిన సహకారం తదితర అంశాలను జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు తన నివేదిక ద్వారా సభకు తెలియజేశారు. వీటిపై రంగాలు, ప్రాంతాలు వారీగా ప్రతినిధులు చర్చించి తమ అభిప్రాయాలను తెలియజేశారు. వీటితోపాటు జిల్లాలోని సమస్యలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, వాటి ప్రభావం తదితర అంశాలపె చర్చించారు. పాలక పార్టీల నిర్లక్ష్యం వల్లే జిల్లా అత్యంత వెనుకబడిందని, ఈ నేపథ్యంలో పాలకులు అనుసరిస్తున్న ప్రజా కార్మిక కర్షక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించాలని సభ నిర్ణయించింది. గిరిజనుల సంస్కృతి సంప్రదాయాలను దెబ్బతీసి, వారి మధ్య విభేదాలు సృష్టించి, తద్వారా ప్రజల నుంచి వచ్చే వ్యతిరేకతను తగ్గించుకునేందుకు ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని, దీన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత తీసుకోవాలని మహాసభ తెలిపింది. మహాసభలో 23 అంశాలపై వివిధ రంగాలకు చెందిన నాయకులు పెట్టిన తీర్మానాలను ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ప్రజా పోరాటాలకు ఎర్ర జెండా నిరంతరం అండగా నిలుస్తుందని పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ అన్నారు. ఇందుకోసం ప్రజలతో మమేకమై పనిచేయాలని సూచించారు. సభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పుణ్యవతి

ఐక్య ఉద్యమాలకు సిద్ధం కండి : పుణ్యవతి

ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గతంలో మన్యం జిల్లాలో తోటపల్లి నిర్వాసితుల ఉద్యమం సహా అనేక పోరాటాలు స్ఫూర్తిదాయకంగా నిలిచాయని గుర్తు చేశారు. ఒకప్పుడు అనేక నిర్బంధాల నడుమ అటు పార్టీని విస్తరించడంతోపాటు ఇటు ప్రజా ఉద్యమాలను కూడా ముందుకు సాగించామని గుర్తు చేశారు. ప్రస్తుతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న నేపథ్యంలో ప్రజలను మరింత అప్రమత్తం చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని దిశా నిర్దేశం చేశారు. బిజెపి అధికారంలోకి వచ్చాక మతతత్వ శక్తులు పెట్రేగుతున్నాయని, తద్వారా ప్రజల మధ్య చీలికలు తెస్తున్నాయని అన్నారు. వీటిని ఎదుర్కొనేందుకు ప్రజా సమస్యలను అజెండా చేసి ప్రజలను సమీకరించడమే మార్గమని అన్నారు. స్థానిక సమస్యలపై అధ్యయనం చేసి వాటి పరిష్కారానికి నిర్దిష్టమైన కార్యాచరణ రూపొందించి ముందుకు కదలాలని పిలుపునిచ్చారు.

వామపక్ష ఐక్యతతో ప్రజా సమస్యల పరిష్కారం

సిపిఐ జిల్లా కార్యదర్శి మన్మథరావు

వామపక్షాల ఐక్య పోరాటాలతోనే ప్రజలకు మెరుగైన భవిష్యత్తు సాధ్యమవుతుందని సిపిఐ మన్యం జిల్లా కార్యదర్శి కోరంగి మన్మథరావు అన్నారు. పార్టీలు వేరైనా సిపిఎం, సిపిఐ తదితర వామపక్ష పార్టీలు ప్రజా సమస్యలపై పోరాటం విషయంలో అంతా కలిసికట్టుగా ఉంటామని అన్నారు. పాలక పార్టీలన్నీ ఏకమై గుత్త పెట్టుబడిదారులకు సేవ చేస్తున్నాయని, దేశ సంపాద సైతం దోచిపెడుతున్నాయని విమర్శించారు. ఈ నేపథ్యంలో ఒక్క ప్రభుత్వాలపైనే కాకుండా పాలక పార్టీలన్నింటినీ ఎండగట్టేందుకు కమ్యూనిస్టులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ఇవీ మహాసభ ఆమోదించిన తీర్మానాలు

- గిరిజనులు సాగుచేసే జీడి పిక్కలను ఐటిడిఎ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయాలి. మద్దతు ధర కల్పించాలి. స్థానికంగా జీడి ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలి.
- అటవీ హక్కుల చట్టం ప్రకారం ప్రతి గిరిజన కుటుంబానికి 10 ఎకరాల వరకు పోడు భూమిపై హక్కు కల్పించాలి.
- ఏజెన్సీలో తగినన్ని ఆసుపత్రులు ఏర్పాటు చేసి, వాటిలో పూర్తి స్థాయిలో వైద సిబ్బందిని నియమించాలి.అన్ని రకాల జబ్బులకూ మందులను అందుబాటులో ఉంచాలి
- ప్రపంచ బ్యాంకు విధానాల్లో భాగంగా గిరిజన ప్రాంతంలో మూసివేసిన పాఠశాలలను పునరుద్ధరించాలి. జిల్లాలో తలపెట్టిన గిరిజన యూనివర్సిటీని త్వరితగతిన పూర్తి చేయాలి. ఎంఎ, ఎంఎస్‌సి వంటి పీజీ కోర్సులు జిల్లాలో అందుబాటులో ఉండే విధంగా యూనివర్సిటీలు ఏర్పాటు చేయాలి. ఏజెన్సీలో సవర సవర భాష విద్యా వాలంటీర్లను కొనసాగించి వారికి వేతనాలు క్రమం తప్పకుండా చెల్లించాలి.
- జిల్లాలో సాగునీటి వనరులు పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెచ్చే వరకు ప్రభుత్వాలపై ఒత్తిడి చేయాలి. ముఖ్యంగా నిధులు కేటాయించే విధంగా పోరాడాలి.
- గిరిజన ప్రాంతంలోని ఏనుగుల విధ్వంసం నుంచి ప్రజల్ని రక్షించేందుకు వీలుగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.
- ఉపాధి హామీ చట్టం ప్రకారం ప్రతి కుటుంబానికి ఏటా 200 రోజులు పని గ్యారంటీగా కల్పించాలి. కనీస వేతనం రూ. 600 చెల్లించాలి.
- మహిళలు, చిన్నపిల్లలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను అరికట్టేందుకు ప్రభుత్వం చొరవ చూపాలి. ఇందుకోసం మాదకద్రవ్యాలను, మద్యాన్ని నియంత్రించాలి.
- సాగునీటి ప్రాజెక్టులు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు తదితర ప్రభుత్వ అవసరాల కోసం సేకరించిన భూమి వల్ల నష్టపోయిన నిర్వాసితులకు మెరుగైన పరిహారం, పురావాసం కల్పించాలి
- కళాకారులకు మన్యం జిల్లా పుట్టినిల్లు. జనజీవన సంస్కృతికి జానపద కళలు పట్టుగొమ్మలు. ఈ నేపథ్యంలో కళాకారులను ప్రభుత్వం ప్రత్యేకంగా ఆదుకోవాలి.
- పూర్ణపాడు -లాబేసు వంతెన నిర్మాణ పనులు వేగవంతం చేసి, రహదారి సదుపాయాన్ని కల్పించాలి.
- మూసివేసిన జీగిరాం జ్యూట్ మిల్లును వెంటనే తెరిపించి కార్మికులకు ఉపాధి పునరుద్ధరించాలి.
- లచ్చయ్యపేట ఎన్‌సిఎస్ సుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలి. దీన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని నడిపించడం ద్వారా చెరుకు రైతులను ఆదుకోవాలి.
- పూర్తిగా గిరిజనులు ఉన్న గ్రామాలను 5వ షెడ్యూల్ ఏరియాలో కలపాలి.
- నిత్యావసర ధరలను అదుపు చేసేందుకు ప్రభుత్వం యత ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి.
- పట్టణంలో చెత్త పన్ను, నీటి పన్ను, విలువ ఆధారిత పన్ను తదితర రూపాల్లో ప్రజలపై వేసిన భారాలను తగ్గించాలి. పౌర సేవలను మరింతగా మెరుగుపరచాలి.
- జిల్లాలో పరిశ్రమల ఏర్పాటు, సాగునీటి వనల అభివద్ధి వంటి చర్యలు తీసుకోవడం ద్వారా జిల్లాలో వలసలను నివారించాలి.
- జిల్లాలో స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలి, పని ఒత్తిడి తగ్గించాలి.
- జీవో నెంబర్ 3ను పునరుద్ధరించి గిరిజన యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు పెంచాలి.

సిపిఎం జిల్లా కార్యదర్శిగా కొల్లి గంగునాయుడు

19 మందితో జిల్లా కమిటీ

కొల్లి గంగునాయుడు

మహాసభలో జిల్లా నూతన కమిటీ 19 మందితో ఎన్నికైంది. వీరంతా ఆరుగురిని కార్యదర్శివర్గంగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా కొల్లి గంగునాయుడు, కార్యదర్శివర్గ సభ్యులుగా ఎం.తిరుపతిరావు, కోలక అవినాష్, వి.ఇందిర, ఎన్‌వై నాయుడు, కె.రామస్వామి ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ సభ్యులుగా కార్యదర్శి, కార్యదర్శివర్గ సభ్యులతో పాటు రెడ్డి వేణు, రెడ్డి శ్రీదేవి, డి.రమణారావు, జి.తిరుపతిరావు, ఎం.శ్రీనివాసరావు, కె.కృష్ణమోహన్, ఎం.రమణ, ఎ.భాస్కరరావు, కె.సాంబమూర్తి, పి.రాజశేఖర్, కె.ఈశ్వరరావు, బివి రమణ, జి.వెంకటరమణ, కోఆప్షన్ సభ్యుడు ఒకరున్నారు.

వి.ఇందిర

ఎం.తిరుపతిరావు

కె.అవినాష్

ఎన్‌వై నాయుడు

కె.రామస్వామి



సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు పుణ్యవతిని కలిసిన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు

సమస్యలపై చొరవ చూపండి

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు పుణ్యవతికి గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల విన్నపం

ప్రజాశక్తి - కురుపాం

తమ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని గిరిజన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు.. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు పుణ్యవతిని కోరారు. బుధవారం కురుపాంలో సిపిఎం మన్యం జిల్లా మహాసభ ప్రాంగణంలో పుణ్యవతిని కలిసి వారి సమస్యలను విన్నవించారు. అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మక దివాకర్ మాట్లాడుతూ పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో తొమ్మిది గిరిజన గురుకులాల్లో వంద మందికి పైగా, రాష్ట్రంలో 1600 మందికి పైగా అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు పనిచేస్తున్నారని తెలిపారు. ఉద్యోగ భద్రత కోసం వారంతా 22 రోజులుగా ఐటిడిఎల ఎదుట నిరసన కార్యక్రమాలు చేపడుతున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేదన్నారు. స్థానిక గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కానీ, అధికారులు కానీ నిరసన వద్దకు రాకపోవడం చాలా అన్యాయమన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, తమ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తిచేశారు. వారి విజ్ఞప్తిపై పుణ్యవతి స్పందిస్తూ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు చేస్తున్న పోరాటానికి సిపిఎం పూర్తి మద్దతు ఇస్తుందని ప్రకటించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు పి.మోహన్‌రావు, కె.కిశోర్, టి.తిరుపతిరావు, ఎం.ఉమామహేశ్వరరావు, ఎం.హరిబాబు పాల్గొన్నారు.

సమస్యలపై ఎమ్మెల్యేకు వినతులు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ నలుమూలల నుంచి పెద్దఎత్తున ప్రజలు పాల్గొని వినతులు అందజేశారు. ప్రతి సమస్యను క్షుణ్ణంగా తెలుసుకొని సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే చొరవ చూపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

రాష్ట్ర పండగగా శంబర జాతర

సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ ● ఉత్సవ ఏర్పాట్లపై అధికారులతో సమావేశం

ప్రజాశక్తి-పార్వతీపురం

ఉత్తరాంధ్రలో ప్రఖ్యాతి గాంచిన శంబర పోలమాంబ ఉత్సవాలను రాష్ట్ర స్థాయి పండగలా నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ అన్నారు. బుధవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో శంబర జాతర ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జాతరకు జిల్లాతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి లక్షలాదిగా యాత్రికులు తరలివస్తారని, అందుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. గత అనుభవాల దృష్ట్యా లోపాలను సవరించుకుంటూ జాతరను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. పక్కాగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి, ఎటువంటి సంఘటనలూ జరగకుండా చర్యలు తీసుకోవాలని పోలీస్ శాఖను కోరారు. తాగునీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులూ ఉండరాదని సబ్ కలెక్టర్ అన్నారు. తాగునీటి కుళాయిలు, బోర్లు పూర్తి స్థాయిలో పనిచేయాలని ఆదేశించారు. పారిశుధ్యం పక్కాగా ఉండాలని, పార్వతీపురం, సాలూరు మున్సిపాలిటీల నుంచి కార్మికులు, వాహనాలను జాతర జరిగే ప్రదేశానికి పంపించాలని సూచించారు. పారుశుధ్యం సక్రమంగా లేకపోవడం వల్ల తదుపరి రోజుల్లో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. అమ్మవారి మారు జాతర ముగిసే వరకు వారంలో ఒక రోజు పారుశుధ్యంపై దృష్టిసారించాలని స్పష్టంచేశారు. జాతరకు వచ్చే భక్తులకు పార్కింగ్ సౌకర్యం కల్పించాలని సూచించారు. వాహనాల ప్రవేశం, బయటకు వెళ్లే మార్గాలు పక్కాగా ఉండాలన్నారు. జాతరలో స్వచ్ఛంద కార్యకర్తల సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. అత్యవసర సమయంలో అంబులెన్సులు వెళ్లటకు రహదారి అందుబాటులో ఉండాలని స్పష్టంచేశారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సిరిమాను తిరిగే రోజున విద్యుత్తు నిరంతరం సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాక్షికంగా దెబ్బతిన్న విద్యుత్తు స్తంభాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని సూచించారు. రవాణాకు ఎటువంటి సమస్యలూ లేకుండా చర్యలు తీసుకోవాలని రహదారులు, భవనాల శాఖ అధికారులకు తెలిపారు. ఎటువంటి కల్తీ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సిసి టివిలు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు.

ఈ నెల 23న పెద్దమ్మ వారి చాటింపుతో ప్రారంభమై 2025 ఏప్రిల్ ఒకటో తేదీన జరిగే చండి హోమం, మహాన్నదానంతో ఉత్సవాలు ముగుస్తాయని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. ప్రధానంగా జనవరి 27న తొలేళ్ల ఉత్సవం, 28న అమ్మవారి సిరిమానోత్సవం, 29న అనుపోత్సవం జరుగుతాయని వివరించారు. సాలూరు రూరల్ సిఐ పి.రామకృష్ణ మాట్లాడుతూ ముగ్గురు డిఎస్‌పిలు, 14 మంది సిఐలు, 42 మంది ఎస్ఐలతో సహా మొత్తం 700 మందిని బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

ఈ సమావేశంలో జిల్లా విపత్తు స్పందన అధికారి కె.శ్రీనివాసబాబు, ఆర్అండ్‌బి ఇఇ కె.సుబ్బారావు. సాలూరు ఎక్సైజ్ సిఐ జి.దాస్, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ పి.ఎం.కె రెడ్డి, జిల్లా రవాణా అధికారి ఎం.శశి కుమార్, సాలూరు డిపో మేనేజర్ ఎ.భాస్కర్‌రెడ్డి, శంబర మెడికల్ ఆఫీసర్ పి.రమ్య సాయి, మక్కువ తహశీల్దార్ షేక్ ఇబ్రహీం, ఇఒపిఆర్‌డి దేవకుమార్, శంబర పొలమాంబ దేవాలయాల ఇఒ వి.వి.నారాయణ, దేవస్థానం మాజీ చైర్మన్ పూడి దాలినాయుడు, శంబర ఎంపిటిసి తీళ్ల పోలినాయుడు, ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ

ఉమ్మితడి పనులేనా?

ప్రజాశక్తి-పార్వతీపురం

గుంతల పూడ్చివేతలకు రూ.12.5 కోట్లు

జిల్లాలో ప్రధాన రహదారుల్లో గుంతలను పూడ్చే పనులు శరవేగంగా జరుగుతున్నాయి. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని రహదారుల్లో గుంతలను పూడ్చాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించింది. ఈ మేరకు జిల్లాలో ఉన్న రహదారులపై గుంతలు కప్పడానికి ప్రభుత్వం రూ.12.5 కోట్లు విడుదల చేసింది. సంక్రాంతి నాటికి రహదారులపై గుంతలు లేకుండా చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించడంతో పూడ్చివేత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆగమేఘాలపై చేపడుతున్న ఈ పనుల్లో నాణ్యత ఏమేరకు ఉంటుందనేది ప్రశ్నార్థకంగా మారుతోంది. అధికారుల పర్యవేక్షణ లేకుండానే కాంట్రాక్టర్లు ఈ పనులను మొక్కుబడిగా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జిల్లాలో ప్రధాన రహదారుల్లో ఇప్పటికే పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. గత ఐదేళ్లలో ప్రభుత్వం రహదారుల నిర్మాణంపై దృష్టి సారించక పోవడంతో పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. జిల్లా వ్యాప్తంగా గుంతలు పూడ్చివేతకు సంబంధించి 46 పనులు చేపడుతున్నారు. ఈ నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు. ప్రధానంగా జిల్లా కేంద్రానికి వచ్చే రహదారులన్నీ గుంతలతో నిండి ఉన్నాయి. దాదాపు ఆర్ అండ్ బి రహదారులన్నీ గుంతలతో దర్శనమిస్తున్నాయి. వాస్తవంగా ఈ రహదారులను కొత్తగా నిర్మించాల్సిన అవసరం ఉంది. కానీ ప్రభుత్వం ప్రాథమికంగా గుంతలు పూడ్చివేతకు పనులు చేపట్టడం గుడ్డి కన్నా మెల్ల మేలు అన్న చందంగా తయారైంది. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే రహదారులపై గుంతలు పూడ్చినా ఎక్కువ కాలం నిలబడే అవకాశం లేదు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

ఆర్అండ్‌బి శాఖలో ఇంజినీర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్ల కొరత తీవ్రంగా ఉంది. మండలానికో ఎఇ ఉండాలి. కానీ నాలుగు మండలాలకు ఒక ఎఇ చొప్పున ఉన్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్లు చాలా తక్కువ మంది ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో చేపడుతున్న గుంతలు పూడ్చివేత పనుల పర్యవేక్షణ అధికారులకు తలనొప్పిగా తయారైంది. పర్యవేక్షణ లేని కారణంగా కాంట్రాక్టర్లు గుంతల పూడ్చివేత పనులు మొక్కుబడిగా చేస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

రోడ్లపై గుంతలు పూడ్చుతున్న కార్మికులు

నాణ్యతా లోపాలు లేకుండా పనులు

జిల్లాలో రహదారులపై గుంతలు పూడ్చివేత పనుల్లో నాణ్యతా లోపాలు లేకుండా చూస్తాం. ఈ నెలాఖరికి గుంతలు లేని రహదారులు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు పనులు జరుగుతున్నాయి. సిబ్బంది కొరత ఉన్నప్పటికీ పనులకు ఆటంకం లేకుండా చేపడుతున్నాం.

- కె.సుబ్బారావు, ఇఇ, ఆర్‌అండ్‌బి

అక్రమ డెప్యుటేషన్లు రద్దు చేయాలి

ప్రజాశక్తి-పార్వతీపురం

గిరిజన సంక్షేమ గురుకులాల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సమ్మె కారణంగా ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను డెప్యుటేషన్‌పై నియమించడం దుర్మార్గమని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్ రావు చెప్పారు. ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులను గురుకులాల్లో డెప్యుటేషన్ పై పంపిస్తే అక్కడ విద్యార్థులకు పాఠాలు ఎవరు చెపుతారని ప్రశ్నించారు. రెండు చోట్ల గిరిజన విద్యార్థులే నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. ఈ ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలని, లేకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సింగిల్ టీచర్, అనారోగ్యంతో బాధపడుతున్న టీచర్లకు డెప్యుటేషన్‌పై నియమించడం తగదని ఖండించారు.

గుమ్మలక్ష్మీపురం : గిరిజన గురుకులాల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పల్ల సురేష్ ప్రభుత్వాన్ని కోరారు. గత కొన్ని రోజులుగా అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు తమ సమస్యలపై ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేస్తున్నారని తెలిపారు. మరోవైపు ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సిఆర్‌టిలకు గురుకులాల్లో డెప్యుటేషన్ వేయడం సరికాదని తెలిపారు.

నెలాఖరికి రోడ్ల నిర్మాణాలు పూర్తి

ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర

ప్రజాశక్తి-సీతానగరం

రోడ్ల నిర్మాణాలు, మరమ్మతులను ఈ నెలాఖరిలోగా పూర్తి చేస్తామని ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర తెలిపారు. బుధవారం సీతానగరం బజారులో రోడ్ల మరమ్మతులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. సువర్ణముఖి నదిపై వంతెన నిర్మాణ పనులు కూడా మార్చి 31లోగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పెదబోగిలి సర్పంచ్ జొన్నాడ తెరీజమ్మ, ఉప సర్పంచ్ కె.అరవింద్ కుమార్, టిడిపి మండల నాయకులు పెంట సత్యంనాయుడు, టిడిపి మండల కార్యదర్శి రౌతు వేణుగోపాల్ నాయుడు, సాల హరిగోపాల్ రావు పాల్గొన్నారు.

శావణికి బహుమతి, ప్రశంసాపత్రం అందిస్తున్న ఎఎస్‌పి దిలీప్‌కుమార్

వ్యాసరచనలో సత్తాచాటిన శ్రావణి

ప్రజాశక్తి సీతానగరం

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'సైబర్ నేరాలు - డ్రగ్స్ వాడకం -దుష్పరిణామాలు అనే అంశంపై జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి బంక శ్రావణి సత్తాచాటింది. ఈ మేరకు బుధవారం శ్రావణికి ఎఎస్‌పి దిలీప్‌కుమార్ బహుమతి అందజేశారు. శ్రావణిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇల్లా ప్రసన్నలక్ష్మి, ఎస్ఎంసి చైర్‌పర్సన్ పలగర శ్రీదేవి, ఎం.శ్రీనివాసరావు, డి.రామారావు అభినందించారు.

చిన్నారులకు సకాలంలో టీకాలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

చిన్నారులు టీకాలు వేయడంలో జాప్యం ఉండకూడదని వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు వైద్య సిబ్బందికి సూచించారు. మండలంలోని చొక్కాపువానివలస గ్రామాన్ని బుధవారం సందర్శించారు. వ్యాధినిరోధక టీకాలు షెడ్యూల్ ప్రకారం సకాలంలో వేస్తున్నారా? లేదా? అని ఆర్‌సిహెచ్ రికార్డులు పరిశీలించారు. టీకా సెషన్ ప్రారంభించిన సమయాన్ని యువిన్ పోర్టల్‌లో తనిఖీ చేశారు. తేదీల ప్రకారం టీకా తప్పనిసరి వేయాలని ఆదేశించారు. టీకాలపై తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రంలో రికార్డులు తనిఖీ చేశారు. పిల్లల బరువు, ఎదుగుదల వివరాలు స్పష్టంగా నమోదు చేయాలన్నారు. అనంతరం గర్భిణుల గృహ సందర్శన చేసి ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎంసిపి కార్డు పరిశీలించి పూర్తి వివరాలు నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామంలో జ్వర లక్షణాలతో ఎవరైనా ఉన్నారా? అని సిబ్బందిని అడిగారు. కార్యక్రమంలో డెమో యోగీశ్వరరెడ్డి, ఎఎన్ఎం ఉష, అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్త ఉన్నారు.

45 రోజుల్లో సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి-సీతంపేట

రెవెన్యూ సదస్సులో వచ్చిన సమస్యలను 45 రోజుల్లో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ పి.అప్పలరాజు తెలిపారు. బుధవారం మండలంలో తొత్తడి, పొంజాడ, కుడ్డపల్లి, చినకాంబ, పెద్దకంబ, గొయిది, సవర గొయిది గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. 11 అర్జీలు అందాయి. అధికంగా పేరుమార్పు మ్యుటేషన్లు వచ్చాయని తహశీల్దార్ చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ మధుసూదన్‌రావు, ఆర్ఐ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : మండలంలోని గొట్టివలస, తోటపల్లి గ్రామాల్లో డిప్యూటీ తహశీల్దార్ సుందరరావు ఆధ్వర్యాన రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బోను చంద్రినాయుడు, పెద్దింటి పూర్ణచంద్రరావు, మార్కొండ వాసుదేవరావు, ఎంఆర్ఐ ఎస్ శ్రీనివాసరావు, మండల సర్వేయర్ గాంధీ, విఆర్ఒలు తాతా రవికుమార్, ఉద్దవోలు కరుణాకర్, అల్లువాడ బుచ్చిబాబు, దేవాదాయ శాఖ నుంచి పెడారపు పోలిరాజు, తదితరులు పాల్గొన్నారు.

సూర్యఘర్ యోజనతో ఎంతో మేలు

ప్రజాశక్తి-మక్కువ

ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం వల్ల వినియోగదారులతోపాటు గ్రామపంచాయతీలు కూడా ఎంతో మేలు జరుగుతుందని విద్యుత్ శాఖ డిఇఇ వి.రంగారావు తెలిపారు. బుధవారం స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద వినియోగదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ పథకం ప్రయోజనాలు, సబ్సిడీని వివరించారు. మండలంలోని మక్కువ గ్రామాన్ని మోడల్ విలేజ్‌గా కలెక్టర్ ఎంపిక చేశారని తెలిపారు. మక్కువలో మూడు వేల విద్యుత్ సర్వీసులు ఉన్నాయని చెప్పారు. అందులో 50 శాతం కంటే ఎక్కువ మంది సూర్యఘర్ యోజన పథకాన్ని ఉపయోగించుకుంటే పంచాయతీకి కోటి రూపాయలు ప్రభుత్వం ప్రోత్సాహకంగా అందిస్తుందని తెలిపారు. గ్రామాల్లో వినియోగదారులు ఈ పథకాన్ని ఉపయోగించుకోవాల్సిందిగా ఎఇ జోగినాయుడు అన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది, పలువురు వినియోగదారులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మౌలిక వసతుల ఏర్పాటుతోపాటు ఆర్థికంగా పంచాయతీ అభివృద్ధి లక్ష్యంగా ప్రణాళిక ప్రకారం విధులు నిర్వహించాలని ఎంపిడిఒ కె.రూపేష్.. కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో సచివాలయ సహాయకులకు, కార్యదర్శులకు నిర్వహిస్తున్న సదస్సులో ఆయన మాట్లాడారు. పల్లె సీమల అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన పెంచుకుని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌డిఒ రామ్‌నరేష్, మాస్టర్ ట్రెయినీలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట గిరిజన సంక్షేమ గురుకులంలో పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు ఆధ్వర్యాన బుధవారం అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు సంభవిస్తే తీసుకోవాల్సిన చర్యలు, అందులో చిక్కుకున్న వారిని కాపాడటంపై తర్ఫీదు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జి.కృష్ణమోహన్, వైస్ ప్రిన్సిపల్ పి.విజయలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సచివాలయ సందర్శన

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో మండ సచివాలయాన్ని బుధవారం ఎంపిడిఒ కె.గీతాంజలి సందర్శించారు, సచివాలయ సిబ్బంది హాజరు, ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్ష నిర్వహించారు. ఆన్‌లైన్లో హాజరు తప్పనిసరిగా వేయాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని సిబ్బందికి సూచించారు. హౌస్‌హోల్డ్ సర్వే వేగవంతం చేయాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్ చిన్నారావును ఆదేశించారు. మిస్సింగ్ సిటిజెన్ సర్వే పూర్తి చేయాలని, ఎన్‌పిసిఐ బ్యాంక్ ఖాతాలు తెరవడంలో పురోగతి సాధించాలని చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శులు ఉమామహేశ్వరరావు రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ గీతాంజలి

ఉద్యోగాలు ఇక్కడే.. విధులు ఎక్కడో

దెయ్యాలకొంపగా విఆర్ఎస్ సబ్ డివిజన్ కార్యాలయం

ప్రజాశక్తి-సాలూరు

మామిడిపల్లిలోని విఆర్ఎస్ సబ్ డివిజన్ కార్యాలయం

మండలంలోని మామిడిపల్లిలో ఉన్న వెంగళరాయసాగర్ సబ్ డివిజన్ కార్యాలయం గత కొన్నేళ్లుగా దెయ్యాలకొంపగా మారింది. ఒకప్పుడు ఉద్యోగులతో కళకళలాడే కార్యాలయం ఇప్పుడు బోసిపోయింది. వెంగళరాయసాగర్ ప్రాజెక్టుకు సమీపంలో ఉన్న మామిడిపల్లి గ్రామంలో దశాబ్దాల క్రితం సబ్ డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేశారు. ఈ కార్యాలయం నిత్యం డిఇ, ఎఇ, జెఇతోపాటు సీనియర్, జూనియర్ అసిస్టెంట్లతో సందడిగా ఉండేది. గత కొన్నేళ్లుగా ఈ కార్యాలయానికి ఏ ఒక్కరూ రావడం లేదు. డిఇ, ఎఇలు ఎప్పుడూ ఈ కార్యాలయ ముఖం చూసిన దాఖలాలు లేవు. కార్యాలయంలో పని చేయాల్సిన ఉద్యోగులు కూడా కనిపించడం లేదు. కొంతమంది అటెండర్లు మాత్రం కనిపిస్తున్నారు. వీరికి చేతినిండా పనిలేదు. సబ్ డివిజన్ కార్యాలయం నుంచి పని చేయాల్సిన డిఇ, ఎఇలు, ఇతర కార్యాలయ ఉద్యోగులు ఎక్కడ పని చేస్తున్నారనేది అంతుచిక్కని ప్రశ్నగా మిగిలింది. సబ్ డివిజన్ కార్యాలయాన్ని ఎత్తేశారా? అంటే అదీ లేదు. ఇక్కడ పనిచేస్తున్న ఉద్యోగులు, అధికారులే దీనిని దెయ్యాలకొంపగా తయారు చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

> ఈ చిత్రాన్ని చూశారా? ఇదో ప్రభుత్వ కార్యాలయం అంటే నమ్ముతారా? పదుల సంఖ్యలో అధికారులు, ఉద్యోగులు ఇక్కడ పనిచేస్తుంటారంటే అతిశయోక్తిగా అనిపించదూ? హర్రర్ సినిమాలో దెయ్యాలకొంపలా ఉన్న ఈ భవనం వెంగళరాయసాగర్ సబ్‌డివిజన్ కార్యాలయం. దెయ్యాల సంగతేమో గానీ అధికారులు మాత్రం ఇక్కడ కనిపించరు. అధికారుల రాకపోకలు లేకపోవడం, నిర్వహణ గాలికొదిలేయడంతో ఇలా తయారైంది.

ఎఫ్ఆర్ఎస్ సంగతేమిటో మరి

ప్రభుత్వ ఉద్యోగులంతా ప్రతిరోజూ తప్పనిసరిగా కార్యాలయంలో ఫేస్ రికగ్నైజేషన్ యాప్‌లో ఉదయం, సాయంత్రం వేళల్లో నమోదు కావాల్సి ఉంది. అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులూ ఉదయం, సాయంత్రం నిర్ణీత సమయానికి ఎఫ్ఆర్ఎస్ వేయాలనే నిబంధనలు ఉన్నాయి. అయితే ఈ సబ్ డివిజన్‌లో పనిచేసే అధికారులు, ఉద్యోగులు ఎక్కడ నుంచి ఎఫ్ఆర్ఎస్ చేస్తున్నారో అంతుచిక్కడం లేదు. వారి ఇళ్ల నుంచే ఎఫ్ఆర్ఎస్ చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇరిగేషన్ ఉన్నతాధికారుల కళ్లుగప్పి ఇక్కడే పనిచేస్తున్నట్లు మేనేజ్ చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ డిప్యూటీ సిఎంలు రాజన్నదొర, పుష్ప శ్రీవాణి , వైసిపి నాయకులు

13న రైతు సమస్యలపై నిరసన

మాజీ డిప్యూటీ సిఎంలు రాజన్నదొర, పుష్పశ్రీవాణి

ప్రజాశక్తి-సాలూరు

ఈ నెల 13న రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర చెప్పారు. బుధవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడిచినా సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చకుండా మీనమేషాలు లెక్కిస్తోందని విమర్శించారు. బడులు ప్రారంభించి ఆర్నెల్లు అయినా తల్లికి వందనం కింద రూ.15 వేలు చెల్లించలేదని ధ్వజమెత్తారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన కూడా ఇవ్వలేదన్నారు. నెలకు రూ.1500 చొప్పున ప్రతి మహిళకు ఇస్తానన్న నగదు పంపిణీ చేయలేదని చెప్పారు. నిరుద్యోగులకు ఇస్తామన్న రూ.3 వేల భృతి కూడా లేదన్నారు. ఇక మొదటి సంతకమని చెప్పిన మెగా డిఎస్‌సితో ఇంకా ప్రభుత్వం దోబూచులాడుతోందని దుయ్యబట్టారు. 20 లక్షల ఉద్యోగాలంటూ ఆశపెట్టి యువతను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. జాబ్ కేలండర్ ఇంతవరకు విడుదల చేయలేదన్నారు. వీటితో పాటుగా పాత పథకాలు అమలు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారని, అవి ఎక్కడున్నాయో తెలియదని చెప్పారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు ఇస్తామని చెప్పి, ఖరీఫ్ సీజన్ ముగిసి, రబీ ప్రారంభమైనా ఒక్క రైతుకీ నయా పైసా ఇవ్వలేదని మండిపడ్డారు. ఈ మోసాలపై ప్రభుత్వ తీరును ఎండగడుతూ నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు రాజన్నదొర చెప్పారు. ఈ కార్యక్రమానికి జిల్లాలో ఉన్న ఎంపిటిసి సభ్యులు, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, కౌన్సిలర్లు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

గుమ్మలక్ష్మీపురం : ఈ నెల 13న జిల్లా కలెక్టరేట్‌కు రైతులతో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మాజీ డిప్యూటీ సిఎం పాముల పుష్పశ్రీవాణి తెలిపారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను జియ్యమ్మవలస మండలం చినమేరంగి కోటలో బుధవారం ఆవిష్కరించారు. రైతుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి కార్యకర్తలు, నాయకులు, సర్పంచులు పాల్గొని, విజయవంతం చేయాలని ఆమె కోరారు.

బహుళ పంటలతో రైతులకు మేలు

ప్రజాశక్తి-పాచిపెంట

ఏకపంట విధానం వల్ల భూసారం దెబ్బతినడమే కాకుండా జీవ వైవిధ్యం నశించి చీడపీడల ఉధృతి పెరుగుతుందని మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు తెలిపారు. రైతులు బహుళ, అంతర పంటల విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఈ మేరకు బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. బహుళ పంటల విధానంతో మిత్ర పురుగుల సంఖ్య పెరుగుతుందని చెప్పారు. భూమిలో జీవ వైవిధ్యం, సేంద్రియ కార్బన్ శాతం పెరుగుతాయని తెలిపారు. రైతులు పొటాష్ ఎరువులు అన్ని పంటలలో విత్తనంతో పాటుగా వేసుకోవాలని సూచించారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుందన్నారు. పురుగు మందులతో వేపనూనె కలిపి పిచికారీ చేసుకుంటే కత్తెర పురుగును గుడ్డు దశలోనే నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మతల బలరాం, గ్రామ వ్యవసాయ సహాయకులు వినోద్, లక్ష్మణ్ , తదితరులు పాల్గొన్నారు.

అపరాలు సాగు.. ఆదాయం బాగు

గరుగుబిల్లి : అపరాల సాగుతో ఆదాయం బాగుంటుందని రీజనల్ తిమోటిక్ లీడ్ కె.ప్రకాశ్ తెలిపారు. తోటపల్లి జట్టు ట్రస్ట్ నూతన కార్యాలయంలో జిల్లాలో మోడల్‌గా ఎంపిక చేసిన గుమ్మలక్ష్మీపురం మండలంలోని ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలకు బుధవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రకృతిని పరిరక్షించుకోవలసిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలు తూచ తప్పకుండా అందరూ పాటించాలని సూచించారు. రీజనల్ టెక్నికల్ ఆఫీసర్ జి.హేమసుందర్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో వర్షాలు అనుకూలంగా ఉండడం రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి, దిగుబడులు బాగా సాధించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ అసోసియేట్ జి.అన్నపూర్ణ, మండల్ ఇన్‌ఛార్జి వి.పోలినాయుడు, వెంకట్ నాయుడు, మాస్టర్ ట్రైనర్ శ్రీరామ్, ఎం.గౌరునాయుడు పాల్గొన్నారు.

అంతర పంటలు పరిశీలన

సీతంపేట : మండలంలోని దిబ్బగూడ గ్రామంలో బంట్రోతు శ్రీను ఎటిఎం నమూనాను ఆర్‌సిఒ కృష్ణారావు బుధవారం పరిశీలించారు. అరటిలో అంతర పంటగా వేసిన పెసర, మినుములు, ముల్లంగి, బెండ, తోటకూర, గోంగూర, క్యారెట్ పంటలను పరిశీలించారు. అదే రైతు 25 సెంట్ల విస్తీర్ణంలో వేసుకొన్న మారిసస్ క్యూ పైనాపిల్ పంటను పరిశీలించారు. రైతులు, ఐసిఆర్‌పిలకు సార్వత్రిక సూత్రాల గురించి, ఎటిఎం, ఏ గ్రేడ్ మోడల్స్, బయోవిలేజ్ గురించి సలహాలు ఇచ్చారు. మండ కాలనీ గ్రామంలో సవర భాస్కరరావు ఎటిఎం, ఏ గ్రేట్ మోడల్స్ పరిశీలించి, సూచనలు ఇచ్చారు. ప్రతీ గ్రామం బయోవిలేజ్‌గా మారాలని చెప్పారు. అందుకు అవసరమైన ప్రణాళికలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ అధికారులు హేమలత, ముసలయ్య, డివిజన్ ఇన్‌ఛార్జి బాలు, మండల ఇన్‌ఛార్జి సత్యనారాయణ, యూనిట్ ఇన్‌ఛార్జులు నరేష్ , ధర్మ, రమేష్, కేశవ్ పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రామగోపాల్

సర్వేల్లో పురోగతి సాధించాలి

ప్రజాశక్తి-పాచిపెంట

సర్వేల్లో పురోగతి సాధించాలని గ్రామ, వార్డు సచివాలయ ప్రత్యేక అధికారి బి.రామగోపాల్ అన్నారు. బుధవారం స్థానిక పాచిపెంటలోని సచివాలయాలను, తహశీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఎన్‌పిసిఐ సర్వే, హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్, కోఆర్డినేట్స్ కేప్చరింగ్, మిస్సింగ్ సిటిజన్ల నమోదుపై సచివాలయ కార్యదర్శి, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ త్వరితగతిన సర్వే పూర్తి చేయాలన్నారు. సచివాలయ సిబ్బంది హాజరు నమోదు తప్పనిసరిగా ఉండాలని, సెలవు పెడితే అధికారికంగా ఉండాలని చెప్పారు. మొక్కుబడిగా విధులు నిర్వహించరాదని, విధులకు గైర్హాజరైతే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. మండల కేంద్ర సచివాలయంలో ఆధార్ సెంటర్ తప్పనిసరిగా ఉండాలన్నారు. సచివాలయం-1 లో ఆధార్ సెంటర్‌ను ఇప్పిస్తానని తెలిపారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను ఎంతవరకు పరిష్కరించారని డిప్యూటీ తహశీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. దస్త్రాలను తనిఖీ చేశారు. గత మూడు వారాలుగా నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌కు ఎన్ని దరఖాస్తులు వచ్చాయని ఎంపిడిఒ బివిజె పాత్రోను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పలువురు అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలి

కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్త గేదెల రామకృష్ణ

ప్రజాశక్తి-సాలూరు

మాట్లాడుతున్న కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్త గేదెల రామకృష్ణ

రాష్ట్రంలో పెంచిన విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త గేదెల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. విద్యుత్తు ఛార్జీల పెంపునకు గత ప్రభుత్వం కారణమని కూటమి సర్కారు చెప్పడం సరికాదన్నారు. వైసిపి ప్రభుత్వ పాలనపై అసంతృప్తితోనే ప్రజలు ఆ పార్టీని గత ఎన్నికలలో చిత్తుగా ఓడించారని చెప్పారు. ఇప్పటికే ప్రజలు నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో విద్యుత్తు ఛార్జీల భారం మోపడం తగదన్నారు. ఎన్నికల ముందు టిడిపి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తులో పోరాటానికి సిద్ధమవుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సిగడాపు బంగారయ్య పాల్గొన్నారు.

స్వచ్ఛ సుందర పార్వతీపురానికి సహకరించండి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జట్టు ఆశ్రమం, కలెక్టర్ సహకారంతో నిర్వహిస్తున్న స్వచ్ఛ సుందర పార్వతీపురం కార్యక్రమానికి గ్రామీణ ప్రాంతాల నుంచి సహకారం అందేలా చూడాలని జట్టు ఆశ్రమ నిర్వాహకులు వి.పద్మజ.. ఎంపిడిఒ రూపేష్‌ను కోరారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఆయన్ను కలిసి వినతి అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛ సుందర పార్వతీపురం కార్యక్రమాన్ని పట్టణానికే పరిమితం చేయకుండా గ్రామీణ ప్రాంతంలోనూ అమలు చేయాలని నిర్ణయించామని తెలిపారు. అందుకు మోడల్‌గా వెంకటరాయుడుపేట గ్రామాన్ని ఎంపిక చేశామని చెప్పారు. గ్రామంలో పరిసరాల పరిశుభ్రతతో పాటు అందరికీ ఆరోగ్యం, ఆదాయ వనరులు పెంపొందేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. దీన్ని ఆ గ్రామానికి పరిమితం చేయకుండా మండలంలోని అన్ని పంచాయతీలకు విస్తరించేలా చర్యలు చేపట్టాలని ఎంపిడిఒను కోరారు.

నర్సిపురంలో సైబర్ మోసం

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

స్మార్ట్‌ఫోన్ వినియోగదారులే లక్ష్యంగా చెలరేగుతున్న సైబర్ మోసగాళ్ల బారిన పడి ఓ వ్యక్తి నగదు పోగొట్టుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పార్వతీపురం మండలం నర్సిపురం గ్రామానికి చెందిన బి.దుర్గాప్రసాద్ అనే యువకుడు సెల్‌ఫోనుకు ఈ నెల 5న ఒక మెసేజ్ వచ్చింది. విషయం తెలుసుకుందామని మెసేజ్ ఓపెన్ చేశాడు. తన బ్యాంకు ఖాతా నుంచి రూ.21 వేలు కట్ అయినట్లుగా మెసేజ్ వచ్చింది. తాను ఎవరికీ పంపించకుండా నగదు ఎవరికి బదిలీ అయిందని బ్యాంకు అధికారుల దృష్టికి తీసుకువెళ్లాడు. దీనిపై దర్యాప్తు చేస్తామని వారు తెలిపారు. బుధవారం రూరల్ పోలీస్ స్టేషన్లో ఎస్ఐ సంతోషి కుమారికి బాధితుడు ఫిర్యాదుచేశాడు. ఈ సందర్భంగా రూరల్ ఎస్ఐ సంతోషి మాట్లాడుతూ అనుమానాస్పద, సంబంధంలేని మెసేజ్‌లు వస్తే దయచేసి ఎవరూ ఓపెన్ చేయవద్దని కోరారు.

రూ.1.89 కోట్లతో హాస్టళ్ల మరమ్మతులు

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలోని 11 సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో సుమారు రూ.1.89 కోట్లతో మరమ్మతులు చేపట్టనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ వెల్లడించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నిధులను కేటాయించినట్లు బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కలెక్టర్ తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లోని మేజర్ మరమ్మతులకు రూ.1.50 కోట్లు, మైనర్ పనులకు రూ.37.60 లక్షలు ప్రభుత్వం కేటాయించిందని చెప్పారు. వసతిగృహాల మరమ్మతుల పనులను సకాలంలో పూర్తి చేసి, సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పనుల నాణ్యతలో రాజీపడొద్దని సూచించారు. వసతిగృహాల్లో అత్యవసర మరమ్మతులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని తెలిపారు. పాక్షిక మరమ్మతులను ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

నేటి నుంచి సర్పంచులకు శిక్షణ

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

జియమ్మవలస మండలంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి గురువారం నుంచి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ ఇస్తున్నట్లు ఎంపిడిఒ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12, 13, 18, 19 తేదీలలో ఎంపిడిఒ, వెలుగు కార్యాలయాల్లో ఈ శిక్షణ ఉంటుందని తెలిపారు. 12, 13న టికె జమ్ము, పిటి మండ, కొండచిలకాం, అలమండ, శిఖబడి, జియ్యమ్మవలస, అర్నాడ పంచాయతీలకు ఎంపిడిఒ కార్యాలయంలో, డంగభద్ర, గడిసింగిపురం, బొమ్మిక, బిజె పురం, జిటి వాడ, అంకవరం ఇటిక, కెటివాడ, పెదబుడ్డిడి పంచాయతీలకు వెలుగు కార్యాలయంలో శిక్షణ నిర్వహిస్తున్నామని చెప్పారు. 18, 19న తుంబలి, ఎం.అల్లువాడ, పిప్పలభద్ర, తాళ్లడుమ్మ, చినమేరంగి, పరజపాడు గ్రామాలకు ఎంపిడిఒ కార్యాలయంలో, పెద్దమేరంగి, కెపిడి వలస, బిత్రపాడు, గవరంపేట, చింతల బెలగాం, కుదమ, టిఎన్ వలస, బాసంగి గ్రామాలకు వెలుగు కార్యాలయంలో శిక్షణ నిర్వహించనున్నామని వివరించారు.

శిబిరంలో రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురంలో కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం వారపు సంతలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యాన బుధవారం పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్యులు నేత్ర వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ప్రారంభించారు. మన్యం జిల్లాలోని మారుమూల ప్రాంతమైన గుమ్మలక్ష్మీపురంలో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి, గిరిజనులకు కంటి పరీక్షలు చేయడం సంతోషకరమని ఎమ్మెల్యే జగదీశ్వరి అన్నారు. కంటి సమస్యలున్న వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. రోగులకు ఆహార పొట్లాలు అందజేశారు. ఈ శిబిరంలో 193 మంది కంటి పరీక్షలు నిర్వహించగా, 55 మందిని శస్త్రచికిత్సలకు ఎంపికచేశారు. వారిని విజయనగరంలోని పుష్పగిరి కంటి ఆసుపత్రి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వీరేష్ చంద్రదేవ్, అరకు పార్లమెంటరీ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, మండల కన్వీనర్ పాడి సుదర్శన్ రావు, నాయకులు కోలా రంజిత్ కుమార్, వెంకట నాయుడు, విజయాంకుశం, సుమన్, తదితరులు పాల్గొన్నారు.

స్త్రీనిధి ద్వారా రూ.2.50 కోట్ల రుణాలు

ప్రజాశక్తి-పాచిపెంట

మండలంలో 1150 డ్వాక్రా గ్రూపుల్లో ఉన్న 500 మందికి స్త్రీనిధి ద్వారా 2024-25 సంవత్సరానికి రూ.2.50 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు ఎజిఎం కె.హేమలత తెలిపారు. బుధవారం మహిళా సంఘాలతో స్త్రీ నిధి రుణాలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జి ఎపిఎం బి.శివున్నాయుడు, సిసిలు, విఒఎలు, తదితరులు పాల్గొన్నారు.

కుల దూషణ సరికాదు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

రాజ్యాంగ పదవిలో ఉన్న షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకరయ్య చేసిన కులదూషణ వ్యాఖ్యలపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్లు అక్కేన మధుసూదన్ రావు, గొట్టాపు వెంకట్‌నాయుడు ఒక ప్రకటనలో కోరారు. కుల దూషణలు ఏ సంస్కృతికి ప్రతీక అని ప్రశ్నించారు. ఇలాంటి వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యేపై జాతీయ మానవ హక్కుల సంఘానికి, కేంద్ర హోంశాఖ మంత్రికి ఫిర్యాదు చేస్తున్నట్టు వివరించారు. ప్రజాస్వామ్యంలో ఎవరికీ పదవుల శాశ్వతం కాదని ఆ ఎమ్మెల్యే తెలుసుకోవాలని, ఆ వ్యాఖ్యలు వెంటనే ఉపసంహరించుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

తాగుడు వద్దని కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పార్వతీపురం పట్టణంలోని పెద్దమాదిగవీధికి చెందిన బండి సీతారాం పెయింటర్. విపరీతంగా మద్యం తాగి అనారోగ్యం పాలుకావడంతో భార్య, పిల్లలు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన ఆయన ఇంట్లో గడ్డిమందు తాగాడు. కుటుంబ సభ్యులు జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు అవుట్ పోస్ట్ పోలీసులు కేసు నమోదు చేశారు.